సాక్షి జగిత్యాల

మంగళవారం । 21 । మార్చి । 2023



రాజన్నకు నీరాజనం

వేములవాడ: వేములవాడ రాజన్నను సోమవారం సుమారు 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.



ఉత్తమ ఎస్టీఎస్‌గా శ్రీనివాస్

రాయికల్: ఎస్టీఎస్ బొంగోని శ్రీనివాస్ టీజీ నియంత్రణలో చేస్తున్న సేవలను గుర్తించి హైదరాబాద్‌లో ఉత్తమ అవార్డు అందించారు.

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్


నేటి నుంచి శ్రీరామలింగేశ్వర జాతర



ముస్తాబైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం

గొల్లపల్లి(ధర్మపురి): చిల్వకోడూర్ శ్రీరామలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఉగాది పర్వదినం సందర్భంగా ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈసారి కూడా అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్‌కు ఉత్తరాన 70 కి.మీ., జగిత్యాలకు తూర్పున 20 కి.మీ. దూరంలో జగిత్యాల – పెద్దపల్లి మార్గంలో ఆలయం ఉంది. కోరిన కోర్కెలు తీర్చే దేవునిగా శ్రీరామలింగేశ్వరస్వామి ప్రసిద్ధికెక్కారు. మంగళవారం నాగవెల్లి కార్యక్రమంలో వేడుకలు ప్రారంభిస్తారు. ఈనెల 24న స్వామివారి ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈసందర్భంగా ప్రతీరోజు స్వామివారికి ప్రత్యేకపూజలు చేస్తారు. జాతరలో భాగంగా ఇక్కడ ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారం.

ఒత్తిడికి లోనుకావొద్దు



పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న నారాయణ

జగిత్యాల: ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఒత్తిడికి లోను కావొద్దని, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని జిల్లా పరీక్షల కన్వీనర్ నారాయణ సూచించారు. సోమవారం పలు పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులు టెలిమానస్ 14416 నంబరుకు ఫోన్‌చేసి వైద్యుల నుంచి సలహాలు, సూచనలు పొందాలని సూచించారు. కాగా, సోమవారం జరిగిన పరీక్షలకు 8064 మంది విద్యార్థులకు 398 మంది గైర్హాజరయ్యారని, 95.06 శాతం నమోదైందని వివరించారు.

'బీఆర్‌ఎస్ నాయకుల కమీషన్ల కక్కుర్తి'



ఆందోళనకారులను తొలగిస్తున్న పోలీసులు

మేడిపెల్లి(వేములవాడ): కమీషన్ల కోసమే బీఆర్‌ఎస్ నాయకులు అభివృద్ధి పనులు అడ్డుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణ ఆరోపించారు. వారి తీరును నిరసిస్తూ నిజామాబాద్ – జగిత్యాల జాతీయ రహదారిపై సోమవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ, మేడిపెల్లి – గోవిందారం వరకు డబుల్ రోడ్డు పనుల కోసం ఎంపీ బండి సంజయ్ రూ.20కోట్లు మంజూరు చేశారని, అయితే, కమీషన్లు ఇవ్వడం లేదనే సాకుతో బీఆర్‌ఎస్ నాయకులు నాలుగు నెలలుగా పనులు అడ్డుకుంటున్నారన్నారు. తక్షణమే పనులు సాగేలా చూడాలని డిమాండ్ చేశారు. నాయకులు ముంజ శ్రీనివాస్, దశరథరెడ్డి, తిరుపతిరెడ్డి, ఎస్ ఎన్‌రెడ్డి, మధుకర్, గొష్కి మధు, జలపతిరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండగట్టు ఏఈవోగా బుద్ధి శ్రీనివాస్

సాక్షి ఎఫెక్ట్..

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ఏఈవోగా బుద్ధి శ్రీనివాస్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఆలయంలో ఉద్యోగుల కొరత, భక్తులకు తలెత్తుతున్న ఇబ్బందులు, ఇతర సమస్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనాలు ప్రచురించింది. స్పందించిన దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు.. హైదరాబాద్ లోనిగణేశ్ ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌ను కొండగట్టు అంజన్న ఆలయానికి బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీనివాస్ గతంలోనూ ఇక్కడే విధులు నిర్వర్తించారు. ఇటీవల హైదరాబాద్ బదిలీపై వెళ్లారు. అనుభవం ఉన్న అధికారి అవసరమనే ఉద్దేశంతోనే ఆయనను మళ్లీ ఇక్కడకు బదిలీ చేశారని తెలిసింది. కాగా, శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరిస్తారు.

ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారు?



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు(ఫైల్)

> **నేరస్తులపై నిఘా పెంచాం**
>
> జిల్లాలో రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచాం. పోలీస్‌స్టేషన్ల వారీగా నిఘా పటిష్టం చేశాం. జిల్లాలో తరచూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నాం.
>
> – భాస్కర్, ఎస్పీ

- రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా
- శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి
- నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ
- 'కొండగట్టు' వరుస చోరీలు, హత్యల నేపథ్యంలో మరింత అప్రమత్తం

ఇతర జిల్లాలకు రౌడీషీటర్లు..

రౌడీషీటర్లుగా పోలీసు రికార్డుల్లో చేరిన కొందరు ఇతర జిల్లాలు, ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. అక్కడ ఎవరి కంటాపడకుండా చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇలాంటివారి కదలికలపైనా జిల్లా పోలీసులు నిఘా పెంచారు. తొలుత అక్కడి పోలీసులకు సమచారం అందించి రౌడీషీటర్ల కదలికలు గమనిస్తున్నారు.

జగిత్యాలక్రైం: శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా, నేరాల నియంత్రణ ధ్యేయంగా జిల్లా పోలీసు శాఖ రౌడీషీటర్ల కదలికలపై నిఘా తీవ్రతరం చేసింది. కొద్దిరోజులుగా వివిధ గ్రామాలు, పట్టణాల్లో చోటుచేసుకుంటున్న హత్యలు, చోరీలు, అసాంఘిక కార్యకలాపాల నేపథ్యంలో పోలీసు శాఖ మరింత అప్రమత్తమైంది. ప్రధానంగా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో వరుస చోరీలు, అదేప్రాంతంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి హత్య, ఆ తర్వాత దహనం కేసులను సవాల్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు.. తొలుత రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

తీరు మారడంలేదని..

- జిల్లాలో మొత్తం 182 మంది రౌడీషీటర్లు ఉన్నారని పోలీసు రికార్డులు చెబుతున్నాయి.
- వీరిలో సత్ప్రవర్తన తీసుకొచ్చేందుకు పోలీసు శాఖ తరచూ కౌన్సెలింగ్ ఇస్తోంది. అయినా, కొందరి తీరు మారడంలేదని గుర్తించింది.
- వీరు హత్యలు, అపహరణలు, రౌడీయిజం, దౌర్జన్యాలు, కుమ్ములాటలు, గొడవలు, బెదిరింపులు, భూదందాల్లో జోక్యం చేసుకుంటున్నారని పోలీసులు భావిస్తున్నారు.
- ఇలాంటివారి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసుస్టేషన్ల వారీగా నిఘా పెంచారు.
- ప్రధానంగా గ్యాంగ్‌స్టర్లు, హిస్టరీషీటర్లు, వారిఅనుచరుల చిట్టాను ఎప్పటికప్పుడు తిరగేస్తున్నారు.
- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ చట్టం ప్రయోగిస్తామని ముందుగానే హెచ్చరిస్తున్నారు.
- కొందరిని ఠాణాకు పిలిపించి తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేస్తున్నారు.
- ఆ తర్వాత రూ.లక్ష – రూ.ఐదు లక్షల వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెడుతున్నారు.
- అంతేకాదు.. భవిష్యత్‌లో అరాచకాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడబోమని, సత్ప్రవర్తనతో వ్యవహరిస్తామని వారినుంచి హామీ తీసుకుంటున్నారు.
- మరోవైపు.. రౌడీషీటర్లలో ఒకరిద్దరు చోటామోటా నాయకులు కూడా ఉండటం గమనార్హం.

నేరాల తీవ్రత ఆధారంగా కేసులు..

గతేడాది జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్ ట్రిపుల్ మర్డర్ కేసులో ఐదుగురిపై పీడీయాక్ట్ నమోదు చేశారు. నేరాల తీవ్రత ఆధారంగా నేరస్తులపై రౌడీషీట్ తెరుస్తున్నారు. 20ఏళ్ల క్రితం రౌడీషీట్ నమోదై.. ఇంకా నేరాలు కొనసాగిస్తున్న వారినుంచి.. కొత్తగా రౌడీషీట్ నమోదైనవారూ ఈ జాబితాలో చేరారు.

ఇంటింటా ఇంకుడుగుంత

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: ఇంటింటా ఇంకుడుగుంత నిర్మించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత కోరారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇంకుడుగుంతల తవ్వకంపై జెడ్పీ సీఈవో రామానుజాచార్యులు, డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి నరేశ్‌తో సమీక్షించారు. గ్రామాల్లో మురుగునీరు రోడ్లపైకి చేరుతోందని, తద్వారా దోమలు వృద్ధి చెంది ప్రజలు మలేరియా, డెంగీ తదితర వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. ఇంకుడుగుంతల ద్వారా ఇలాంటి పరిస్థితులు ఉండవని ఆమె తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సూచించారు.

రైతులకు అండగా ఉంటాం

జగిత్యాలరూరల్: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ, కాంగ్రెస్‌కు లేదన్నారు. 40ఏళ్లుగా రైతుల కోసం ఏపని చేయనివారు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాలుగు రెట్ల పంట దిగుబడి వస్తోందని తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఇప్పటికే పంట నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. పీఎం ఫసల్ బీమా యోజన పథకం గురించి కనీస అవగాహన లేకుండా బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కల రాధ, సింగిల్ విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, అర్బన్ రైతుబంధు కన్వీనర్ జుంబర్తి శంకర్ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించండి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



పంట పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్, అర్బన్ మండలం మోతెలో వర్షాలతో నష్టపోయిన పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. మోతెకు చెందిన కౌలు రైతు సంగెపు భూమయ్య.. తాను నాలుగెకరాలు కౌలుకు తీసుకుని ఎకరాపై రూ.15వేల చొప్పున పెట్టుబడి పెట్టి మొక్కజొన్న సాగుచేశానని, అకాల వర్షాలతో పంట పూర్తిగా నేలరాలిందని రోదించాడు. చల్‌గల్‌కు చెందిన చంద భూమయ్య, చిన్నకోల భూమయ్య, బద్దం శ్రీనివాస్‌రెడ్డి పంటలు ఇదే పరిస్థితిలో ఉండగా జీవన్‌రెడ్డి వాటిని పరిశీలించారు. అధికారులు తక్షణమే రంగంలోకి దిగి పంట నష్టం అంచనాలు రూపొందించాలని కోరారు. నాయకులు రాజేందర్, సురేశ్, వేణు, సతీశ్, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

సారంగాపూర్(జగిత్యాల): భారీ వర్షాలు, వడగండ్లతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకుంటేనే రైతులు ముందుకు సాగుతారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పెంబట్లలో వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, నువ్వు పంటలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం పంటల బీమా పథకం అమలు చేయడంలేదని, దీంతో ప్రతీ సీజన్‌లో అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు పంటలు నష్టపోతున్నారని తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు, ఎకరాకు రూ.20వేల పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, నాయకులు ముద్దం చిరంజీవి, కూసరి మహేశ్, కోసవేని రాజేందర్, తోట మల్లయ్య, ముండ్ల రాజమల్లు, గంగారాం, బెజ్జెంకి రమేశ్, తేలు లింగారెడ్డి, కొలపాక రవి, రైతులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు



నిరసన దీక్షలో నాయకులు

జగిత్యాలటౌన్: టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలకు బాధ్యుడైన రాష్ట్రమంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్‌ను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. సత్యనారాయణరావు మాట్లాడుతూ, గ్రూప్ –1 అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.లక్ష పరిహారం చెల్లించాలన్నారు. తెలంగాణ ఏర్పాటయ్యాక ఒకేఒక గ్రూప్– 1 నోటిఫికేషన్ జారీఅయ్యిందని, ప్రశ్నపత్రాలు లీక్ కావడం అభ్యర్థులకు శాపంగా మారిందని అన్నారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులను క్షోభకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన ఎజెండాగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరగడం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భోగ శ్రావణి, పన్నాల సరిత, వీరబత్తిన అనిల్‌కుమార్, మదన్‌మోహన్, ఆముద రాజు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



- జిల్లాలో 69 పరీక్ష కేంద్రాలు
- 11,177మంది విద్యార్థులు

కథలాపూర్(వేములవాడ): వచ్చేనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. రోజూ ఉదయం 9.30 – మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. సైన్స్ పేపర్‌కు అదనంగా 20 నిమిషాల సమయం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రశ్నపత్రాల సీల్ తీసి విద్యార్థులకు అందించి, పరీక్ష ముగిశాక, సమాధాన పత్రాలు సేకరించి సీల్ చేసేవరకు ప్రతీ అంశాన్ని వీడియోలో చిత్రీకరించాలని, ఇందుకోసం పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

69 పరీక్ష కేంద్రాలు.. 11,177 మంది విద్యార్థులు

- జిల్లాలో పదోతరగతి పరీక్షలకు 11,177 మంది విద్యార్థులు హాజరవుతారు.
- వీరికోసం 69 పరీక్ష కేంద్రాలు కేటాయించామని అధికారులు తెలిపారు.
- ఇందులో ప్రైవేట్ విద్యార్థుల కోసం జిల్లా కేంద్రంలో ఒక పరీక్ష కేంద్రం కేటాయించారు.
- జిల్లాలో పదోతరగతి నిర్వహిస్తున్న ప్రభుత్వ సంస్థల పాఠశాలలు 234, ప్రైవేట్ పాఠశాలలు 130 ఉన్నాయి.
- వార్షిక పరీక్షలకు 11,177 మంది విద్యార్థులు హాజరుకానున్నారని అధికారులు తెలిపారు.
- ఇందులో 5,747 మంది బాలురు, 5,430 మంది బాలికలు ఉన్నారు.
- పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని 69 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను, 69 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు.
- 1,034 మంది ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు.
- వీరేకాకుండా నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తాయి.
- పోలీస్‌స్టేషన్‌ల నుంచి దూరంగా ఉన్న పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాలను తరలించడానికి వాహనాలకు ఇన్‌చార్జిలుగా 22 మంది అధికారులను నియమించారు.

> **నిర్భయంగా రాయండి**
>
> జిల్లాలో పదోతరగతి వార్షిక పరీక్షలకు అన్నిఏర్పాట్లు చేయిస్తున్నాం. విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలి. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిజాగ్రత్తలు తీసుకుంటున్నాం. పరీక్షల సమయంలో ఆందోళన చెందకుండా గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకొని ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.
>
> – జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

గంగాధర్‌కు పురస్కారం




పురస్కారం అందుకుంటున్న గంగాధర్

ధర్మపురి: తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు స్తంభంకాడి గంగాధర్ 2023 కిగాను ఉగాది పురస్కారం అందుకున్నారు. తెలుగు సాహిత్య రంగంలో ఆయన అనేక కవితలు రాశారు. ఆయన సేవలు గుర్తించిన బెంగళూరులోని కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం పురస్కారం అందజేశారు. ఆయన రచించిన 'అమృతతల్పం' వచన కవితా సంపుటికి ఈ పురస్కారం లభించింది. పలువురు ప్రముఖుల చేతుల మీదుగా గంగాధర్ పురస్కారం అందుకున్నా రు. ఆయనను పలువురు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జగిత్యాల: రెండు రోజులుగా అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, నీటి నిల్వలు, ఆహారం కలుషితమయ్యే ప్రమాదం ఉందని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ సోమవారం సూచించారు. కలుషిత నీరు, ఆహారంతో టైఫాయిడ్, కామెర్లు, రక్త విరేచనలు, డయేరియా, కలరా సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం హెచ్3ఎన్2 ద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మళ్లీ భారీవర్షం



పెగడపల్లి: అయితిపల్లిలో కురిసిన వడగళ్లు



వర్షం ధాటికి దెబ్బతిన్న నువ్వుల పంట

కథలాపూర్(వేములవాడ): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం మరోసారి భారీవర్షం కురిసింది. కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో వడగండ్లతో కూడిన వర్షం కురవడంతో సుమారు 50 ఎకరాల్లో నువ్వుల పంట నేలవాలినట్లు రైతులు పేర్కొన్నారు. పోసానిపేటలోనూ భారీవర్షం కురిసింది.

ఆరుగాలం శ్రమ నీటిపాలు..


పెగడపల్లి(ధర్మపురి): నందగిరి, అయితిపల్లి గ్రామాల్లో వడగండ్లవాన పంటలను తీవ్రంగా దెబ్బతీసింది. రెండు గ్రామాల్లో పొట్టదశలోని వరిపైరు దెబ్బతినగా, మామాడి కాయలు నేలరాలాయి. దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

సొరంగం.. అద్భుతం

- భారీ ప్రాజెక్ట్‌లో అరుదైన టన్నెల్
- వెల్దురి – బావోజీపల్లి కాలువ ప్రత్యేకత
- పర్యాటక కేంద్రానికి అనువు



సొరంగంలోకి వెళ్తున్న ఎస్సారెస్పీ నీరు



సొరంగం నుంచి బయటకు వస్తున్న నీరు

జగిత్యాలరూరల్: రాష్ట్రంలోని భారీ సాగునీటి ప్రాజెక్ట్‌ల్లో శ్రీరాంసాగర్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఈ ప్రాజెక్ట్ పరిధిలోని కాకతీయ కాలువ కూడా అంతే ప్రత్యేకత చాటుకుంటోంది. సుమారు 250 మీటర్ల పొడవుతో గుట్టను చీల్చి కాలువ(సొరంగం–టన్నెల్) నిర్మించడం ఆనాటి ఇంజినీర్ల నైపుణ్యానికి అద్దంపడుతోంది. యంత్రాలు వినియోగించకుండానే.. కేవలం పాలమూరు కూలీలతోనే సుమారు ఏడాదిపాటు రాళ్లను తొలిచి కెనాల్ తవ్వడం ఓ అద్భుతం. ఇది వెల్దురి – బావోజీపల్లె శివారు గుట్టల్లో ఉంది.

కోడిగుడ్డు ఆకారంలో..

- వెల్దుర్తి – బావోజీపల్లె శివారు గుట్టల మధ్య అప్పట్లో సొరంగ మార్గం నిర్మించారు.
- శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మానేరు జలాశయం వరకు కాకతీయ కాలువ సుమారు 146 కి.మీ ప్రయాణిస్తోంది.
- ఈ అద్భుత సొరంగమార్గం 86 కి.మీ వద్ద ప్రజలకు కనువిందు చేస్తోంది.
- కోడిగుడ్డు ఆకారం(ఎల్‌టికల్ షేప్).. పైన గుట్ట.. చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం.. టన్నెల్‌కు మరింత అందం తెచ్చిపెడుతున్నాయి.
- ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీళ్లు.. ఒక్కసారిగా ప్రకృతి ఒడిలో మాయమై.. సుమారు 250మీటర్ల తర్వాత మళ్లీ ప్రత్యక్షమై ప్రకృతి ప్రియులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

మన్నికకు ఆదర్శం..

1972లో సొరంగ మార్గం తవ్వారు. ప్రతీరోజు వందల సంఖ్యలో కూలీలు దీనికోసం చెమట ధారపోశారు. ప్రస్తుతం రూ.కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న ప్రాజెక్టులు.. రెండు, మూడేళ్లకే నాణ్యత కోల్పోతుంటే.. సుమారు ఐదు దశాబ్దాల క్రితం మానవశక్తితో తవ్వించిన సొరంగమార్గంలో ఒకపెచ్చు కూడా ఊడిపోలేదంటే ఆశ్చర్యం కలుగకమానదు. సొరంగమార్గం కింద, పైన ఆర్‌సీసీ ప్రూఫ్ చేశారు. 250 మీటర్ల పొడవు, 14 మీటర్ల వెడల్పు, 6.5 మీటర్ల ఎత్తు కలిగిన టన్నెల్ గుండా 11వేల క్యూసెక్‌ల నీటి ప్రవాహం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

> **అభివృద్ధి చేయాలి**
>
> 
>
> అరుదైన సొరంగమార్గం వెల్దుర్తి – బావోజీపల్లెలో మినహా మరెక్కడా లేదు. ప్రభుత్వం దీనిని పర్యాటక కేంద్రంగా మార్చాలి. టన్నెల్‌ను తిలకించేందుకు వచ్చే పర్యాటకుల కోసం తాత్కాలికంగానైనా రోడ్డు నిర్మించాలి.
>
> – బుర్ర ప్రవీణ్‌గౌడ్, సర్పంచ్, వెల్దుర్తి

కాలువ పైభాగంలోని గుట్ట ప్రాంతంలో ఆంజనేయ స్వామి ఆలయం ఉంది. అక్కడకు వెళ్లే భక్తులు కూడా ఈ సొరంగ మార్గం తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది పర్యాటక కేంద్రానికి అనువుగా ఉండటంతో ప్రభుత్వం, అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

క్లుప్తంగా

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు


చికిత్స పొందుతున్న పోచవ్వ

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని దీకొండ, నంచర్ల గ్రామాల్లో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. నంచర్లకు చెందిన జక్కుల పోచవ్వ, పొట్ల రేణ, బుర్ర అనిత, మామిడి రాధ, దీకొండ గ్రామానికి చెందిన మామిడి సౌందర్యలపై దాడి చేసి, కరిచింది. గాయపడిన బాధితులు జగిత్యాల, పెగడపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొంది, తమ ఇళ్లకు చేరుకున్నారు. గ్రామాల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, బయటకు రావాలంటే భయపడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటిని ఇక్కడి నుంచి తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పశుమిత్రల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న పశుమిత్రలు

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పశుమిత్రలు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివచ్చి, ఐడీవోసీ ఎదుట ఆందోళన చేపట్టారు. స్వయం సహాయక సంఘాల్లో చురుగ్గా పాల్గొంటున్న సభ్యుల్లో రాష్ట్రవ్యాప్తంగా 2,500 మందిని ఎంపిక చేసిన ప్రభుత్వం ఎలాంటి వేతనం ఇవ్వకుండా ఊడిగం చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పశుసంవర్ధక శాఖకు, పాడి యజమానులకు మధ్య వారధిగా పని చేస్తున్న పశుమిత్రలను ఆదుకోవాలని కోరారు. అనంతరం ప్రజావాణిలో తమ సమస్యలపై దరఖాస్తు అందజేశారు.

పేకాట.. రోజుకో చోట

- మామిడి తోటలు, గెస్ట్‌హౌస్‌లు, గోదావరి తీరం, అటవీ ప్రాంతాలే అడ్డాలు
- సిట్టింగ్ ఫీజు కింద రూ.లక్షల్లో దండుకుంటున్న నిర్వాహకులు
- జిల్లాలో పరిస్థితి



కోరుట్ల: పట్టణ శివారులోని అయిలాపూర్ రోడ్‌లో ఓ మామిడి తోట.. రెండు బ్యాచ్‌ల్లో సుమారు 21 మంది పేకాటరాయుళ్లు.. ఒక బ్యాచ్‌లో రూ.10 వేలు సిండికేట్.. మరో బ్యాచ్‌లో రూ.5 వేలు సిండికేట్ చొప్పున పేకాట సాగింది. ఈ రెండు బ్యాచ్‌లు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 101 పాయింట్లకు 10 నుంచి 12 ఆటలు ఆడారు. మొత్తం కలెక్షన్ రూ.15 లక్షలు. దీంట్లో పేకాట ఆడించిన వాళ్లు సిట్టింగ్ ఫీజు కింద రూ.1.50 లక్షలు వసూలు చేశారు. ఇలా జగిత్యాల జిల్లాలో ప్రతీరోజు అడ్డగోలుగా సాగుతున్న పేకాటలో సిట్టింగ్ ఫీజు కింద నిర్వాహకులు ఎంత తక్కువ అనుకున్నా రూ.50 లక్షలు దండుకోవడం గమనార్హం. ఇక పేకాటలో చేతులు మారుతున్న సొమ్ముకు లెక్క చెప్పలేని పరిస్థితి.

నిత్యం అడ్డాల మార్పు..

పేకాట నిర్వాహకులు సిట్టింగ్ ఫీజు కింద వసూలు చేస్తున్న డబ్బులతో ఆటగాళ్లకు బీరు, బిర్యానీ, కోరిన మందు తెప్పించడానికి అయ్యే ఖర్చులు, పోలీసుల బెడద లేకుండా చూడటానికి ముగ్గురు, నలుగురు సెంట్రీల ఏర్పాటుకు, కొన్ని సందర్భాల్లో పోలీసులను మేనేజ్ చేస్తామని చెప్పి మరీ కలెక్షన్ చేస్తున్నట్లు సమాచారం. పేకాటరాయుళ్లతో రెగ్యులర్ టచ్‌లో ఉండే నిర్వాహకులు మధ్యాహ్నం వేళ ఆసక్తి ఉన్నవాళ్లకు ఫోన్లు చేసి మరీ రమ్మంటారు. వచ్చేటప్పుడు కనీసం రూ.10 వేలు వెంట తెచ్చుకోవాలని చెబుతారు. నిత్యం అడ్డాలు మార్చుతూ ఆటగాళ్లు అక్కడికి చేరేందుకు లోకేషన్లు షేర్ చేస్తుండటం విశేషం.

సెంట్రీల సమాచారంతో..

పేకాట నిర్వాహకులు రోజూ అడ్డాలు మార్చుతూ పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని జగిత్యాల–రాయికల్ పరిసరాల్లోని మామిడి తోటలు, ధర్మపురి గోదావరి తీరం, కోరుట్ల పట్టణ శివారులోని అయిలాపూర్, కోనరావుపేట రోడ్‌లతోపాటు పట్టణంలోని ఒకటి, రెండు గెస్ట్ హౌస్‌ల్లో, మెట్‌పల్లి–ఇబ్రహీంపట్నం రోడ్డులోని మామిడితోటలు, రాయికల్, మల్లాపూర్ మండలాల సరిహద్దుల్లో ఉన్న నిర్మల్ జిల్లాలోని చినబెల్లాల్, కడెం పరిసరాల్లో, కథలాపూర్–రుద్రంగి శివారులోని అటవీ ప్రాంతాల్లో పేకాట జోరుగా సాగుతున్నట్లు సమాచారం. రోడ్ల వెంట ఎవరు వస్తున్నారు.. అనుమానాస్పదంగా ఉన్నారా..? అన్న విషయాలను సెంట్రీలు ఎప్పటికప్పుడు నిర్వాహకులకు తెలియజేస్తారు. పోలీసులు పట్టుకునేందుకు వెళ్లినా సెంట్రీలు ఇచ్చిన సమాచారంతో వెంటనే అడ్డాను మార్చేస్తున్నారు.

కరువైన నియంత్రణ..

ఆరు నెలల క్రితం కథలాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి పేకాటకు బానిసై పెద్ద ఎత్తున అప్పులు చేశాడు. చివరికి ఇంటికి వెళ్లకుండా లాడ్జీల్లో ఉన్నాడు. అతని భార్య అప్పటి ఎస్పీకి పేకాటపై ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత పోలీసు యంత్రాంగం అప్రమత్తమై పెద్ద ఎత్తున పేకాట నియంత్రణకు చర్యలు తీసుకుంది. మామిడి తోటలు, అటవీ ప్రాంతాల్లో సోదాలు చేసి, పేకాటరాయుళ్లను పట్టుకొని, డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మధ్యకాలంలో పేకాటపై నియంత్రణ కరువవడంతో జోరుగా సాగుతోంది.

తనిఖీలు చేస్తున్నాం..

పేకాట నియంత్రణకు ఎప్పటికప్పుడు తని ఖీ లు చేస్తున్నాం. మామిడితోటలు, అటవీ ప్రాంతాలపై నిఘా పెట్టాం. పేకాటపై సమాచారం ఇస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, డీఎస్పీ, మెట్‌పల్లి

ఇళ్ల కేటాయింపులో అర్హులకు అన్యాయం

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


గ్రామస్తులతో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి(ధర్మపురి): డబుల్ బెడ్‌రూం ఇళ్లను అనర్హులకు కేటాయిస్తూ అర్హులైన పేదలకు అన్యాయం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. పెగడపల్లి మండలంలోని నందగిరి గ్రామంలో నిర్మించి, లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించారు. అసలైన నిరుపేదలను ఎంపిక చేయకుండా ఎంతోకొంత ఆర్థికంగా ఉన్నవారికి ఇళ్లను కేటాయించారని పలువురు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. నందగిరిలో ఇళ్ల కేటాయింపులో జరిగిన అవకతవకలను కాంగ్రెస్ తరఫున కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, విచారణ జరిపిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల సూచన మేరకు అధికారులు నడుచుకోవడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. లింక్–2 కాల్వకు తూము నిర్మించి, నందగిరి బంజరు కుంటకు నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. అయితే ఈ తూము ద్వారా గ్రామంలోని వ్యవసాయ భూములకు పూర్తిస్థాయిలో నీరందే పరిస్థితి లేదన్నారు. ఇదే కాలువకు కొద్ది దూరంలో మరో తూము నిర్మించి, కుమ్మరికుంటకు నీరు చేర్చితే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు మల్లారెడ్డి, రాజు, సత్యనారాయణరెడ్డి, రవి, అశోక్‌రెడ్డి, గంగాధర్, రమేశ్ గౌడ్, జితేందర్‌గౌడ్, తిరుపతి, రవి, లచ్చయ్య, రాజేశం, రాజేందర్, సురేశ్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం

- జిల్లా మాతాశిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

మెట్‌పల్లి(కోరుట్ల): ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా మాతాశిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు చేశారు. సాధారణ ప్రసవాల వల్ల జరిగే ప్రయోజనాలు, సిజేరియన్ల వల్ల కలిగే నష్టాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అత్యవసర కేసులైతే తప్ప సిజేరియన్ చేయవద్దన్నారు. అంతకుముందు పలు రికార్డులను పరిశీలించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల వివరాలు, 102 రూట్ మ్యాప్, కేసీఆర్ కిట్ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సాజిద్ అహ్మద్, వైద్యులు సబిత, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘సాగునీటి విడుదలలో వివక్ష తగదు’


మాట్లాడుతున్న అంజయ్య

కథలాపూర్(వేములవాడ): జిల్లా సరిహద్దులోని రాళ్లవాగు ప్రాజెక్టులో నీళ్లున్నా కథలాపూర్ మండలంలోని గ్రామాల ఆయకట్టుకు సాగునీటి విడుదలలో వివక్ష తగదని పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య అన్నారు. పంటలు ఎండిపోతున్నా పాలకులు పట్టనట్లు వ్యవహరించడం ఏంటని మండిపడ్డారు. సోమవారం కథలాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాళ్లవాగు ప్రాజెక్టు ద్వారా 3,500 ఎకరాలకు నీళ్లందించడం లక్ష్యం కాగా.. భూషణరావుపేట, ఊట్‌పెల్లి, కథలాపూర్ గ్రామాల పరిధిలోని భూములకు యాసంగిలో ఎందుకు నీళ్లివ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని కోనాపూర్ పరిధిలోని భూములకు రాళ్లవాగు ప్రాజెక్టు నీళ్లు పుష్కలంగా అందుతుంటే.. కథలాపూర్ మండలానికి ఎందుకివ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, మండల నాయకులు ఎండీ.రెహనొద్దీన్, జిల్లా లచ్చన్న, రంజిత్, కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వండి

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మధు

జగిత్యాలటౌన్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. జగిత్యాలలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై 19 దరఖాస్తులు అందజేశారు. వాటిని స్వీకరించిన కలెక్టర్ అర్జీదారులతో నేరుగా మాట్లాడి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మంద మకరంద్, అధికారులు పాల్గొన్నారు.

పేపర్ల లీకేజీ బాధ్యులపై చర్య తీసుకోవాలి..

పేపర్ల లీకేజీ బాధ్యులపై చర్య తీసుకొని, టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. తమ విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- ఛైర్మన్ ఇంకా కుర్చీని పట్టుకు వేలాడటం సిగ్గుచేటని విమర్శ

జగిత్యాలటౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగులు క్షోభకు గురవుతున్నారని అన్నారు. చైర్మన్ జనార్దన్‌రెడ్డి ఇంకా కుర్చీని పట్టుకు వేలాడటం సిగ్గుచేటని విమర్శించారు. కాన్ఫిడెన్షియల్ గదిలోకి ఇతరులు వెళ్లడం చైర్మన్ వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. జనార్దన్‌రెడ్డి కమిషనర్‌గా ఉన్నప్పుడే ఇంటర్ మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లతో దాదాపు 30 మంది విద్యార్థులు బలయ్యారని, అలాంటి వ్యక్తిని టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా నియమించడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. నిరుద్యోగుల్లో విశ్వాసం నింపాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్‌పై ఉందని, క్వాలీఫై అయిన ప్రతీ అభ్యర్థికి రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగ ఉద్యోగాల్లో తెలంగాణ వాటా ఎంతో చెప్పాలన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థానికులకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని పేర్కొన్నారు. వాస్తవాలు మాట్లాడితే రాజకీయాలు చేస్తున్నామనడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రసార సాధనాల స్వేచ్ఛను హరించడం సరికాదన్నారు. నాయకులు గిరి నాగభూషణం, గాజుల రాజేందర్, కొత్త మోహన్, బండ శంకర్, మన్సూర్, మధు తదితరులున్నారు.

పావలా వడ్డీ రుణాల కోసం నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

జగిత్యాలటౌన్: ప్రభుత్వం ఇటీవల మహిళా సంఘాలకు విడుదల చేసిన పావలా వడ్డీ రుణాలు తమకు రాలేదని జగిత్యాల పట్టణంలోని టీఆర్‌నగర్‌కు చెందిన మహిళలు అన్నారు. ఈ మేరకు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. టీఆర్‌నగర్‌లో 40 మహిళా సంఘాలున్నాయని అధికారులను సంప్రదించగా టీఆర్‌నగర్ జగిత్యాల పట్టణ పరిధిలోకి రాదని చెప్పారన్నారు. పట్టణ మహిళా సంఘాలకు మాత్రమే పావలా వడ్డీ రుణాలు విడుదలయ్యాయని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి, తమకు న్యాయం చేయాలని కోరారు.

మాలలు ఐక్యంగా ఉండాలి


సమావేశంలో మల్లేశం, నాయకులు

సారంగాపూర్(జగిత్యాల): ప్రభుత్వ పథకాలను మాలలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం మల్లేశం అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన వేదిక మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలు ఐక్యంగా ఉండాలని, ఉన్నత చదువులు చదివాలని చెప్పారు. చట్టాలను గౌరవించి, రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. జిల్లా అధ్యక్షుడు సూరమల్ల సతీశ్, రాష్ట్ర ముఖ్య సలహాదారు బొల్లం విజయ్, రాష్ట్ర కోశాధికారి గుమ్మడి శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కొప్పుల వెంకటరమణ, కమ్మునూర్, కొల్వాయి గ్రామాల సర్పంచ్‌లు బందెల మరియ, మేసు ఏసుదాసు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అంజలి, నాయకులు పాల్గొన్నారు. బీర్‌పూర్ మండలశాఖ కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా బేర అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఉయ్యాల కిషన్, గౌరవ అధ్యక్షుడిగా బందెల వెంకటేశ్ తదితరులు నియమితులయ్యారు.

సీజ్ చేసిన వాహనాల వేలం


వేలంపాటలో పాల్గొన్న డీఎస్పీ, అధికారులు

మల్యాల(చొప్పదండి): మండల పరిధిలో పోలీసులు సీజ్ చేసిన వాహనాలకు సోమవారం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. 24 వాహనాలను వేలం వేయగా కరీంనగర్‌కు చెందిన సయ్యద్ ఆసిఫ్ రూ.1,35,500లకు తుక్కు కింద చేజిక్కించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఎస్సై చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.20 వేల పరిహారం ఇవ్వాలి

- బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి


నువ్వుల పంటను పరిశీలిస్తున్న గోపాల్‌రెడ్డి, నాయకులు

కథలాపూర్(వేములవాడ): వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరానికి రూ.20 వేల పరిహారం ఇచ్చి, రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కథలాపూర్ మండలంలోని కలిగోట శివారులో వర్షంతో నష్టపోయిన నువ్వుల పంటను పరిశీలించారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి నేలవాలి, రైతన్నలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకంలో రాష్ట్రం వాటా చెల్లించకపోవడంతో రైతులకు పరిహారం రాని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రాష్ట్ర సర్కారు స్పందించి, పంటలపై అధికారులతో సర్వే చేయించి, పరిహారం త్వరగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నరెడ్ల రవీందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి బాపురెడ్డి, జలంధర్, మణికంఠ, రాంసింగ్, గంగారెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

- కలెక్టర్‌కు ఉద్యోగ సంఘం నాయకుల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలని ఉద్యోగ సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ యాస్మిన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమగ్ర శిక్షలో కేజీబీవీ, యూఆర్‌ఎస్, బోధనేతర సిబ్బంది, వివిధ హోదాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారని, విద్యాశాఖలో కీలకంగా ఉంటూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించడంతో పాటు ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షలు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి రవి, షారూక్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల్లో ఆనందం

- పే స్కేల్ అమలు చేస్తూ జీవో జారీ
- జిల్లాలో 102 మంది ఉద్యోగులకు మేలు


సమావేశమైన ఉద్యోగులు (ఫైల్)

కథలాపూర్(వేములవాడ)/పెగడపల్లి(ధర్మపురి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. గతేడాది అసెంబ్లీలోనే ప్రభుత్వం పేస్కేల్ అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జీవో నంబర్ 11 జారీచేసింది. దీంతో జిల్లాలో 102 మంది ఉద్యోగులకు మేలు చేకూరనుంది.

2002లో నియామకం..

- కేంద్ర ప్రభుత్వ పథకమైన డీఆర్డీవోలో సెర్ప్ విభాగాన్ని ఏర్పాటు చేసింది.
- ఇందులో పనిచేసేందుకు 2002, 2003 సంవత్సరంలో హెచ్‌ఆర్ పాలసీ కింద ఉద్యోగులను భర్తీచేశారు.
- వీరిని ఐదేళ్లకోసారి రెన్యూవల్ చేసేవారు.
- ఇప్పటివరకు సెర్ప్ ఉద్యోగులకు ఎలాంటి క్యాడర్, పేస్కేల్ అమలు చేయలేదు.
- కాంట్రాక్ట్ పద్ధతిన కొంత వేతనం చెల్లిస్తూ వచ్చారు.

వచ్చే నెల ఒకటి నుంచి అమలు

జిల్లాలోని ఆయా మండలాలు, జిల్లా కేంద్రంలో సెర్ప్‌లో వివిధ హోదాల్లో 102 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకు పేస్కేల్ అమలు లేక, ఏ క్యాడర్‌లో పనిచేస్తున్నారో కూడా తెలియని పరిస్థితుల్లో నెట్టుకొచ్చారు. ప్రభుత్వం శనివారం ప్రకటించిన ప్రకారం.. క్యాడర్ ఫిక్స్ కావడంతో వారికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పేస్కేల్ వర్తించడం, వేతనాలు పొందనున్నారు. సెర్ప్ ఉద్యోగులకు కనిష్ట పేస్కేల్ రూ.19వేల – రూ.58,850 కాగా, గరిష్ట వేతనం రూ. 51,320 – రూ.1,27,310గా నిర్ణయించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పేస్కేల్ అమలు చేయనున్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు


మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం హర్షణీయం. 20ఏళ్లుగా నిబద్ధతతో పనిచేస్తున్నందుకు గౌరవం దక్కింది. దశాబ్దాల కల నెరవేరింది. సెర్ప్ ఉద్యోగుల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉద్యోగులం ఉత్సాహంతో పనిచేస్తాం.

– యాచమనేని రమాదేవి, సెర్ప్ ఏపీఎం

సంతోషంగా ఉంది


మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నాం. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం పేస్కేల్ ప్రకటించారు. ఇన్నాళ్లూ మేం పడిన కష్టానికి ప్రతిఫలం దక్కింది.

– డి.సమత, ఏపీఎం, పెగడపల్లి

గౌరవం దక్కింది


సుమారు ఇరవై ఏళ్లుగా మేం చేస్తున్న పనికి గౌరవం దక్కింది. ఏళ్లనాటి కల నెరవేరింది. ఉద్యోగుల పక్షాన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. పేస్కేల్ వర్తింపజేస్తూ జీవో జారీ చేసిన తెలంగాణ సర్కార్‌కు సెర్ప్ ఉద్యోగులం రుణపడి ఉంటాం.

– చిన్న రాజయ్య, ఏపీఎం, మల్యాల

క్లుప్తంగా

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో మాట్లాడుతున్న స్నేహలత

పెగడపల్లి: వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్మన్ స్నేహలత అన్నారు. సోమవారం ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతిమ ఆస్పత్రి కరీంనగర్ సౌజన్యంతో మండలంలోని నందగిరిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నందగిరి, అయితిపల్లి గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పట్టణ ప్రాంతాల నుంచి వైద్యులు గ్రామాలకు వచ్చి ఉచిత వైద్య సేవలందించడంతో పాటు అవసరమున్న వారికి శస్త్ర చికిత్స అందించడం అభినందనీయమన్నారు. ఎంపీపీ శోభ, సర్పంచులు రాకేశ్, కొండయ్య, ఏఎంసీ చైర్మన్ నిర్మల, వైస్ ఎంపీపీ గంగాధర్, ఆర్బీఎస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ రాజు ఆంజనేయులు, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రహీం, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

ఇబ్రహీంపట్నం : మండలంలోని గోధూర్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ.. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సహకారంతో నిధులు మంజూరు చేయించి అన్నివార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతామన్నారు. సర్పంచ్ సోమ ప్రభాకర్, ఉపసర్పంచ్ తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ కొటగిరి వెంకటస్వామి, మాజీ సర్పంచులు లింగరెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, నాయకులు జాజాల జగన్‌రావు, చల్ల దేవదాస్, మాదం నడ్పి భూమయ్య, నరేశ్, వెంకటస్వామి, పొడెటి గంగాధర్ పాల్గొన్నారు.

శ్రమదానం



వాలంటీర్లతో కలిసి శ్రమదానం చేస్తున్న ప్రజాప్రతినిదులు

మల్యాల: మండలంలోని రాజారం గ్రామంలో సోమవారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శ్రమదానం చేశారు. మాజీ ఎంపీపీ ఎడిపెల్లి అశోక్, జెడ్పీటీసీ రాంమోహన్‌రావు, ప్యాక్స్ చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు వాలంటీర్లతో కలిసి శ్రమదానం చేశారు. గ్రామ పంచాయతీ పరిసరాలను శుభ్రం చేసి, రహదారికి ఇరువైపులా ఉన్న మొక్కల వద్ద పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం జరిగిన సమావేశంలో కళాశాల సంస్థ అధినేత యాద రామకృష్ణ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ పీవో రాకేశ్, అప్సర్, అధ్యాపకులు ఎస్.రఘునాథ్, పీడీ సాయినాథ్ పాల్గొన్నారు.

లక్కీడ్రా ద్వారా ఎంపిక

జగిత్యాల రూరల్: మండల పరిషత్ పరిధిలోని మైనార్టీ కార్పొరేషన్‌లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను మంగళవారం లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వరి తెలిపారు. రెండో విడతలో మూడు యూనిట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మండల పరిషత్‌లో హాజరు కావాలని కోరారు.

'బాధ్యులపై చర్యలు తీసుకోవాలి'

జగిత్యాల: టీఎస్‌పీఎస్సీ బోర్డు కమిటీ రద్దు చేసి బోర్డు చైర్మన్‌పై కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నునావత్ రాజు అన్నారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారు ఉద్యోగం వస్తుందన్న ఆశతో కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుని రేయింబవళ్లు కష్టపడి చదువుతున్నారన్నారు. ఇప్పటికైనా పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

నూతన కార్యవర్గం

కోరుట్ల : పట్టణంలోని ఐబీరోడ్‌లోని శ్రీ హనుమాన్ దేవాలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీలి శేఖర్, ఉపాధ్యక్షుడిగా శీరాములు అమరేందర్, చెట్లపల్లి సాగర్, ప్రధాన కార్యదర్శిగా పుప్పాల నాగరాజ్, కోశాధికారిగా దారిశెట్టి అజిత్, సహ కోశాదికారిగా భాస్కర్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో వసతి గృహాలు

- అరకొర వసతులతో ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు
- పక్కా భవనాలు నిర్మించాలని విద్యార్థుల వేడుకోలు



పెగడపల్లిలో అద్దె ఇంట్లో కొనసాగుతున్న బీసీ వసతి గృహం

పెగడపల్లి : మండలకేంద్రంలో ఏళ్లక్రితం ఏర్పాటు చేసిన ఎస్సీ, బీసీ బాలుర వసతిగృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. అరకొర వసతులతో కూడిన అద్దె ఇళ్లలో కొనసాగిస్తున్నారు. వీటికి పక్కా భవనాలు నిర్మించేందుకు కృషిచేయడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. స్నానాల గదులు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో వసతి గృహంలో వందమంది చొప్పున అవకాశం కల్పిస్తుండగా వసతులు లేని కారణంగా వీటిలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. చేరిన విద్యార్థులు సైతం రాత్రిపూట వారి ఇళ్ల వద్దకే వెళ్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. ఇక్కడ అడ్మిషన్ పొందుతున్న విద్యార్థులు సమీప గ్రామాల్లోని వారు కావడంతో సౌకర్యాలు సరిగా లేకపోవడంతో రాత్రిభోజనం చేశాక నిద్రించేందుకు ఇళ్లకు వెళ్తున్నారు. కాగా సదుపాయాలు కల్పిస్తే వసతి గృహాల్లో ఎక్కువమంది అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించి అన్నివసతులు కల్పించాలని మండల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



వసతి గృహాన్ని అద్దె ఇంటిలో కొనసాగిస్తుండటంతో సరైన సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు, వసతి గృహాలు సక్రమంగా లేవు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పక్కా భవనాలు నిర్మించాలి. వసతులు కల్పిస్తే చాలామంది చేరేందుకు ఆసక్తి చూపుతారు.

– అభినయ్, బీసీ బాలుర వసతి గృహం

సొంత భవనాలు నిర్మించాలి



మండలకేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలి. కనీస సౌకర్యాలేని అద్దె ఇళ్లలో కొనసాగిస్తున్నారు. వసతులు లేని కారణంగా విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. సొంత భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు కృషి చేయాలి.

– నరేశ్, ఎస్సీ బాలుర వసతి గృహం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం..

విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని పెగడపల్లి మండలకేంద్రంలో వసతి గృహ పక్కా భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాగానే అనువైన స్థలాన్ని గుర్తించి పక్కా భవనం నిర్మాణం చేపడుతాం.

– సాయిబాబా, బీసీ వెల్ఫేర్ అధికారి

ప్రజావాణికి వినతుల వెల్లువ



మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

ధర్మపురి : మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణికి సోమవారం కాంగ్రెస్ కౌన్సిలర్లు ఒక దరఖాస్తు అందజేశారు. తహసీల్దార్ వెంకటేశ్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారు సమస్యలపై ప్రజావాణిలో రెండు దరఖాస్తులు అందించారు. ఎంపీవో నరేశ్ కుమార్, ఏఈవోలు తదితరులున్నారు.

మల్యాలలో..

మల్యాల: మల్యాల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ సుజాత తెలిపారు. ముత్యంపేటలోని జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై ఉన్న ఆర్టీసీ బస్టాపులో బస్సులు నిలుపాలని, గుడిపేట గ్రామానికి చెందిన ఇట్టిరెడ్డి అంజిరెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తక్కళ్లపల్లిలో కుంట కబ్జా చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ సుజాత, ఎంఈవో ఐత శ్రీనివాస్, ఏఈఈ కమలేశ్వర్, హరి,మణిదీప్, ఏఓ చంద్రదీపక్, ఎంపీవో వాసవి, సూపరిండెంట్ నాగరాజు, సూపర్‌వైజర్ రాజశ్రీ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మెట్‌పల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఒకే దరఖాస్తు వచ్చినట్లు కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు.

గొల్లపల్లి: గొల్లపల్లిలో ఇక ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ దూలం మధు తెలిపారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా ఉత్తర్వుల మేరకు ప్రజావాణి నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తును అందజేస్తున్న గొధూర్ వీడీసీ సభ్యులు

ప్రజావాణికి ఒక్కటే దరఖాస్తు

కథలాపూర్: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఒక్క దరఖాస్తు మాత్రమే వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన జల అనే మహిళ ఇంటి నెంబర్ కేటాయింపు విషయంలో దరఖాస్తు అందించారు. ఎంపీడీవో జనార్దన్, ఎంఈవో ఆనందరావు, ఏపీఎం నరహరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మహేశ్వర్ తెలిపారు. గొధూర్ గ్రామానికి చెందిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సర్వేనంబర్ 71, 202, 286లో ప్రభుత్వ భూములను సర్వే చేసి హద్దులు చూపించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, ఏవో దీపిక, ఏపీఎం శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆఖిల్, మిషన్ భగీరథ ఏఈ మల్లేశ్, ఐసీడీఎస్, సూపర్‌వైజర్ ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో..

సారంగాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోసం మూడు దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఒకటి వృద్ధాప్య పింఛన్ మంజూరు కోసం, భూ సమస్య, మరుగుదొడ్డి బిల్లులుపై దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ రవీందర్‌రావుతో పాటు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. బీర్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో భూమి సమస్యపై ఒక దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీలత తెలిపారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

కథలాపూర్: కథలాపూర్‌లో సెర్ప్ ఉద్యోగుల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు. సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం నరహరి, సీసీలు అశోక్, అంజయ్య, విజయనిర్మల, రమేశ్, శాంత, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

ధర్మపురి : సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. మండలంలోని కోస్నూర్‌పల్లె గ్రామానికి అనుకొని ఉన్న బోయవాడ నుంచి కోస్నూర్‌పల్లె మీదుగా రాజారం శివారులో ఉన్న బొమ్మలమ్మ గుట్ట వరకు నిర్మించనున్న థార్‌రోడ్ పనులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో రూ.3 కోట్ల మంజూరయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం కోస్నూర్‌పల్లె గ్రామంలో సర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, ఎన్నం తిరుపతిరెడ్డి, జైనా పీఏసీఎస్ చైర్మన్ నరేష్, ఉపాధ్యక్షుడు మూల మోహన్‌రెడ్డి, కుక్కల గంగారెడ్డి తదితరులున్నారు.

పంటల పరిశీలన

కొడిమ్యాల: మండలంలో అకాలవర్షాలతో నష్టపోయిన పంటలను సోమవారం మండల వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని శ్రీరాములపల్లి, నమిలికొండలో అకాలవర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి జ్యోతి పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. ఇక్కడ ఇన్‌చార్జి సర్పంచ్ చల్ల శ్రీనివాస్ రెడ్డి, మాల్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కోరండ్ల నరేందర్ రెడ్డి, ఏఈవో శ్రీలత, రైతులుపాల్గొన్నారు.

మద్దుట్లలో..

మల్యాల: మద్దుట్లలో అకాల వర్షానికి పంటనష్టపోయిన రైతుల పొలాలను, మామిడి తోటలను మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ సర్పంచ్ కెల్లేటి మల్లమ్మతో కలిసి పరిశీలించారు. అధికారులు సర్వే చేపట్టి, పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సర్పంచ్ కెల్లెటి మల్లమ్మ, విద్యావేత్త కెల్లెటి రమేశ్ కోరారు.

సస్యరక్షణపై అవగాహన

మల్యాల : మండలంలోని మానాలలో వరి పొలాలను రైతులతో కలిసి ఏఈవో మంజుల సందర్శించారు. అనంతరం రైతు వేదికలో సోమవారం నిర్వహించిన సమావేశంలో చీడపీడల సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. వరికి అగ్గి తెగులు సోకుతుందని, ఐసోప్రోథయోలెన్ 300మి.లీ, ట్రై సైక్లోజోల్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో రైతులు అప్పాల ముత్తయ్య, మోహన్, మహేశ్, వెంకటి, దేవస్వామి, శేఖర్, విజయ్, గంగవ్వ, మణెమ్మ పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై శిక్షణ

సారంగాపూర్: ఓటరు నమోదు, సవరణ, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై సోమవారం సారంగాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌లెవల్ అధికారులు (బీఎల్‌వో)లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన వారికి కొత్తగా ఓటు హక్కు కల్పించేందుకు వారి నుంచి దరఖాస్తు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ లాస్యశ్రీ, ఆర్‌ఐ భాస్కర్‌రావు తదితరులున్నారు.



శిక్షణలో పాల్గొన్న బీఎల్‌వోలు

రాజకీయ కమిటీ కన్వీనర్‌గా ప్రవీణ్ కుమార్

కోరుట్ల : ఆర్యవైశ్య సంఘం కోరుట్ల నియోజకవర్గం రాజకీయ కమిటీ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన మానుక ప్రవీణ్ కుమార్‌ను నియమించినట్లు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త సురేశ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త సుధీర్, అల్లాడి ప్రవీణ్, చిదురాల వినోద్, నీలి మదు, నేతి శ్రీనివాస్, మారుతి మానుక ప్రవీణ్‌ను అభినందించారు.



ప్రవీణ్ కుమార్

గల్ఫ్ కార్మికుల సమస్యలపై వినతి

మేడిపెల్లి: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లాలోని ఊట్నూర్ మండలంలో మల్లు భట్టి విక్రమార్క చేస్తున్న పాదయాత్రలో మేడిపెల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షులు, టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గల్ఫ్‌కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

సరస్వతీ విగ్రహానికి పూజలు

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చెట్లపల్లి నర్సమ్మ, బాలక్రిష్ణయ్య జ్ఞాపకార్థం చెట్లపెల్లి నరేందర్ గౌడ్ కుటుంబ సభ్యులు సరస్వతి విగ్రహం ఏర్పాటు చేసి పది సంవత్సరాలు గడిచినందున సోమవారం ప్రత్యేక పూజలు చేసి ఘనంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నేమూరి లత, చెట్లపల్లి నరేందర్ గౌడ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు, ఉపసర్పంచ్ రాంరెడ్డి, మాజీ ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌గౌడ్, హైస్కూల్ హెడ్‌మాస్టర్ గణేశ్, నాయకులు నేమూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తిచేయాలి

- ఎంపీపీ బాదినేని రాజమణి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజమణి

బుగ్గారం: మండలంలోని వివిధ గ్రామాల్లో మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ బాదినేని రాజమణి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ రాజమణి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సమావేశానికి మండల జడ్పీటీసీ రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న పనుల ప్రగతి వివరాలను సమావేశంలో తెలిపారు. అకాల వర్షంతో మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు సర్పంచులు కోరారు. జడ్పీటీసీ రాజేందర్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. మండల కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుచేందర్ ,ఎంపీడీవో తిరుపతి, తహశీల్దార్ ఫారుఖ్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: మండలంలోని రాజారం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రవిశంకర్ శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సీసీరోడ్డు రూ.165లక్షలు, ఆర్‌ఆర్ రోడ్డు రూ.40లక్షలు, మహిళా సంఘ భవనం రూ.4.60లక్షలు, రామస్వామి ఆలయానికి రూ.50లక్షలు, పల్లె ప్రకృతి వనం రూ.4లక్షల విలువైన పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అంతకుమందు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడిపెల్లి సుగుణ, మాజీ ఎంపీపీ ఎడిపెల్లి అశోక్, జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, పాక్స్ చైర్మన్లు అయిల్నేని సాగర్‌రావు, బోయినపల్లి మధుసూదన్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, జున్ను సురేశ్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వినతి

మల్యాల: మండలంలోని లంబాడిపల్లి గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలలయంలో కలిసి భవన నిర్మాణానికి, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మిల్కూరి మల్లారెడ్డి, దిండు రమేశ్, ముదారపు బక్కయ్య, మామిడి రాములు, మామిడి నారాయణ ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు



కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

రాయికల్: పట్టణంలో కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. సోమవారం రాయికల్ పట్టణంలోని పదో వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పట్టణ ప్రజలు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మ్యాకల కాంతరావు, సాయికుమార్, తురగ శ్రీధర్ రెడ్డి, మహేందర్, కమిషనర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కోటిలింగాలలో రుద్రాభిషేకం

వెల్గటూర్ : మండలంలోని కోటిలింగాలలో శ్రీ పార్వతి కోటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని గోదావరి తీరంలో సోమవారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పెడిపెల్లి, పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన ఒగ్గు పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులైన ఎనగందుల సత్యనారాయణ శర్మ, నడిమెట్ల రాజేశం శర్మ గార్ల చేత ద్వాదశ పార్థివ లింగాలను ఏర్పాటు చేసి వాటికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. జూలపల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆస్థాన పూజారి ఎలబోయిన తిరుపతి, గాలి పర్వతాలు, బండారి బీరయ్య, నెల్లి మల్లేశం, పుణ్యపుర్తి ఐలేశ్, శ్రావణ్, బోయిని ఉమ, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వెల్గటూర్ : మండలంలో బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు సోమవారం రోజు మండల అధ్యక్షులు చల్లూరి రాంచంద్రం ఆధ్వర్యంలో మొక్కట్రావుపేట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు చల్లూరి రాంచంద్రం మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం ప్రతీ ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ చేపట్టిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను గురించి నిత్యం ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని సూచించారు. ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, స్థానిక సర్పంచ్ ఆగండ్ల తిరుపతి, ఎంపీటీసీ మూగల రాజేశ్వరి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, గ్రామశాఖ అధ్యక్షులు మధుకర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సిరిపురం వాసులు

సారంగాపూర్: పలు సమస్యలను పరిష్కరించాలని బీర్‌పూర్ మండలం సిరిపురం గ్రామసస్తులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ యాస్మిన్‌బాషా కోరారు. రేషన్‌బియ్యం తీసుకోవడానికి మూడు కిలోమీటర్లు నడవాల్సి వస్తుందని పేర్కొన్నారు. మరుగుదొడ్ల బిల్లులు రావాల్సి ఉందని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తదితర సమస్యలను విన్నవించారు. ఉన్నతాధికారులు గ్రామంలో పర్యటించి సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వారి వెంట బీజేపీ బీర్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల తిరుపతి, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మ్యాడ జనార్దన్ తదితరులున్నారు.

నిరుద్యోగులకు లక్ష పరిహారం చెల్లించాలి



దీక్షలో బీజేపీ నాయకులు

కోరుట్ల: టీఎస్‌పీఎస్సీ పరీక్షా పత్రం లీకేజీకి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి నిరుద్యోగులకు లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు సురభి నవీన్ కుమార్, జేయస్ సునీతా వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం బీజేపీ నాయకులు ఒక్కరోజు దీక్ష నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్, పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివ్, జిల్లా కార్యదర్శులు శీలం వేణు, లక్ష్మీ, సుధవేణి మహేశ్, అంబల్ల సుదర్శన్, సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, ఎంపీటీసీ పంచిరి విజయ్, కౌన్సిలర్లు మాడావేణి నరేష్, పెండెం గణేశ్, సునీతా రాజశేఖర్, రాజమురళి, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.